నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్
5 | నిజామాబాద్, మంగళవారం 26 డిసెంబర్ 2023 | ADILABAD

## అమరవీరులకు నివాళి



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

ఇంద్రవెల్లి, డిసెంబర్ 25 : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని హీరాపూర్ వద్ద గల అమరవీరుల స్తూపాన్ని సోమవారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సందర్శించారు. అనంతరం 1981 ఏప్రిల్ 20వ తేదీన అమరులైన వీరులకు నివాళులర్పించారు. స్తూపం వద్ద స్మృతివనం ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రికి ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా వాజ్‌పేయ్ జయంతి



భైంసా : అటల్ బిహారీ వాజ్‌పేయ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

భైంసా, డిసెంబర్ 25 : నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో సోమవారం మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అటల్ బిహారీ వాజ్‌పేయ్ చిత్రపటానికి ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పూలమాల లేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్ బాబు, నాయకులు పాల్గొన్నారు.



భీంపూర్ మండలంలోని నిపాని శివారులో గల చేనులో పత్తి

## చేనులోనే పత్తి

### కూలీల కొరతతో రైతన్నల అవస్థలు

భీంపూర్, డిసెంబర్ 25 : ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని కరంజి(టి), అంతర్గాం, నిపాని, పిప్పల్‌కోటి సహా పలు గ్రామాల్లోని చేలలో చెట్లపైనే పత్తి ఉంది. పత్తి ఏరడానికి కూలీలు దొరుకకపోవడంతో కర్షకులు ఇబ్బంది పడుతున్నారు. స్థానిక కూలీలతోపాటు మహారాష్ట్ర కూలీలు దొరుకుతున్నప్పటికీ వీరు సరిపోవడం లేదు. సాధారణంగా కిలోకు రూ.4లు చెల్లిస్తుండగా.. ఈ సీజన్‌లో రూ.9 లు ఇస్తున్నారు. ఒక్కో కూలీ రోజుకు 60 కిలోల పత్తి ఏరతాడు. కూలీలు దొరుకని కారణంగా డబుల్ కూలి ఇవ్వాల్సి వస్తున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల మాత్రం కూలీలు దొరుకడం లేదు.



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న భూక్యా జాన్సన్ నాయక్

## జాన్సన్ నాయక్ పరామర్శ

ఖానాపూర్, డిసెంబర్ 25 : నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణానికి చెందిన సీనియర్ నాయకుడు కొత్తపెల్లి సురేశ్ తల్లి ధర్మాబాయి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. సోమవారం బీఆర్ఎస్ నేత భూక్యా జాన్సన్ నాయక్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె మృతికి గల కారణాలు తెలుసుకున్నారు. మృతిపై ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ ఖలీల్, మాజీ ఏఎంసీ చైర్మన్ సక్కారం శ్రీనివాస్, గంగారావు, రమేశ్ ఉన్నారు.

# అంపశయ్యపై కొయ్య బొమ్మ



నిర్మల్ కొయ్య బొమ్మలు

### సంక్షోభంలో పరిశ్రమ.. గందరగోళంలో కళాకారులు..

- కరువైన ప్రోత్సాహం.. పట్టించుకోని బీజేపీ ప్రభుత్వం..
- ఐదారేండ్లుగా తరిగిపోతున్న 'పొనికి' కర్ర నిల్వలు
- కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ప్లాంటేషన్‌కు చర్యలు
- తాజాగా ప్రధానమంత్రి మోదీ హామీ ఇచ్చినా నెరవేరని వైనం
- ఎగుమతులపై కార్యాచరణ కరువు

నిర్మల్, డిసెంబర్ 25(నమస్తే తెలంగాణ) : ప్రపంచ ప్రసిద్ధి గాంచిన నిర్మల్ కొయ్య బొమ్మల పరిశ్రమ అంపశయ్యపైకి చేరింది. బొమ్మలు తయారు చేయడానికి అవసరమైన ప్రధాన ముడిసరుకు పొనికి కర్ర దొరకడం లేదు. ఫలితంగా దీనిపై ఆధారపడ్డ దాదాపు 200 కుటుంబాల జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారింది. పదేండ్ల నుంచి కేంద్రంలోని బీజేపీ సర్కారును ఆదుకోవాలని వేడుకున్నా.. ఎగుమతుల విషయంలో రాయితీలు, ఇతర ప్రోత్సాహకాలు అందించాలని విన్నవించినా పట్టించుకోవడం లేదు. గత కేసీఆర్ ప్రభుత్వం సహకారం అందించినా.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాత్రం ఆదుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. కేసీఆర్ ప్రభుత్వం కూడా పలుమార్లు కేంద్రానికి విజ్ఞప్తి చేసినా.. బీజేపీ పెద్దలు కనికరించక పోవడంతో పరిశ్రమ అంపశయ్యపైకి చేరుకున్నది.




నిర్మల్‌లో కొయ్య బొమ్మల పరిశ్రమ భవనం

### పూర్వవైభవం తీసుకొస్తామని మోదీ హామీ

తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో నిర్మల్ జిల్లా కేంద్రానికి బీజేపీ ప్రచారానికి వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొయ్య బొమ్మల పరిశ్రమను ఆదుకుంటామని, పూర్వ వైభవం తీసుకొస్తామని, కళాకారులందరికీ జీవనోపాధి మెరుగుపరుస్తామని బహిరంగ సభా వేదికపై ప్రకటించారు. అంతేకాకుండా అప్పటి రాష్ట్ర ప్రభుత్వమే ఆదుకోలేదంటూ విమర్శలు గుప్పించారు. తాము ఎన్నికలు ముగియగానే ఆదుకొని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అయితే ఎన్నికలై నెల రోజులు గడిచినా హామీలు నెరవేర్చక పోవడం విమర్శలకు తావిస్తున్నది. పరిశ్రమను ఆదుకునేందుకు కేంద్రంలోని బీజేపీ సర్కారు పకడ్బందీ కార్యాచరణను చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

### మోదీ హామీకి రూపులేదు..



రాబోయే రోజుల్లో ఈ కళ ముందు తరాలకు వెళ్లాలంటే పొనికి చెట్లను బాగా పెంచాలి. కేంద్ర ప్రభుత్వం అటవీ అనుమతులను కూడా సులభతరంగా ఇవ్వాలి. మొన్నటి ఎన్నికల ప్రచారానికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నిర్మల్ వచ్చినప్పుడు కొయ్య బొమ్మల పరిశ్రమను ఆదుకుంటామన్నారు. ఇప్పటి వరకైతే ఎలాంటి స్పందన లేదు. - శ్రీనివాస్, కొయ్య బొమ్మల కళాకారుడు, నిర్మల్.

### తరిగిపోతున్న 'పొనికి' నిల్వలు

పొనికి కర్ర కొరత కారణంగా ఐదారేళ్లుగా పరిశ్రమ తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. ఇక్కడి అటవీ ప్రాంతంలో ప్లాంటేషన్ నిరంతరాయంగా జరగక పోవడం, చెట్లు కనుమరుగై పోవడంతో కలప లభ్యత కష్టంగా మారింది. మొన్నటి వరకు అటవీ శాఖ ఆధ్వర్యంలోని టింబర్ డిపోల్లో పొనికి నిల్వలను కొనుగోలు చేసి బొమ్మలు తయారు చేసేవారు. డిపోల్లో నిల్వలు తగ్గిపోవడంతో పొరుగు జిల్లాలతోపాటు, సరిహద్దు రాష్ట్రాల్లో కూడా అన్వేషిస్తున్నారు. ఇలాంటి పరిణామాల నేపథ్యంలోనే కొయ్య బొమ్మల మనుగడ ప్రశ్నార్థకమవుతున్నది. పరిశ్రమ ఉనికికి ముప్పు తప్పదని భావించిన కేసీఆర్ ప్రభుత్వం ఊరటనిచ్చే చర్యలు చేపట్టింది. హరితహారం పథకంలో భాగంగా పొనికి మొక్కల ప్లాంటేషన్‌ను పెద్ద ఎత్తున చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. మొక్కల పెంపకానికి అనువైన ప్రాంతాలుగా మామడ మండలంలోని కొరిటికల్, గాయిద్‌పెల్లి, వాస్తాపూర్, లింగాపూర్, తోటిగూడ గ్రామాలను ప్రయోగాత్మకంగా ఎంపిక చేసింది. మొదట లింగాపూర్ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో హరితహారం కింద 1000 పొనికి మొక్కలు నాటారు. అలాగే వాస్తాపూర్, గాయిద్‌పెల్లి గ్రామాల్లో దశలవారీగా పెంపకాన్ని చేపట్టాలని నిర్ణయించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి పరిశ్రమను ఆదుకునే చర్యలు చేపట్టాలని కళాకారులు కోరుతున్నారు.

## హ్యాపీ క్రిస్మస్

- ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో వేడుకలు
- చర్చిల్లో క్రైస్తవుల ప్రార్థనలు, బైబిల్ పఠనం
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు
- అలరించిన సాంస్కృతి కార్యక్రమాలు


**కరుణామయుడు, శాంతిదూత** యేసుక్రీస్తు జన్మదినం సందర్భంగా సోమవారం ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా కొనసాగాయి. క్రైస్తవులు పెద్ద సంఖ్యలో చర్చిలకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేయగా, పాస్టర్లు దైవ సందేశాన్ని వినిపించారు. హ్యాపీ క్రిస్మస్.. మేరీ మేరీ క్రిస్మస్.. అంటూ క్రీస్తును స్తుతిస్తూ గీతాలు ఆలపించారు. కేక్‌లు కట్ చేసి.. మిఠాయిలు పంపిణీ చేశారు. ఆయా చోట్ల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.



నిర్మల్ అర్బన్ : ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



కుంటాల : కల్లూర్ చర్చిలో వేడుకలు



ఉట్నూర్ రూరల్ : లక్కారంలోని చర్చిలో కేక్ కట్ చేస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు



ఖానాపూర్ : సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు చేస్తూ..



ఇంద్రవెల్లి : క్యాండిల్స్ వెలిగించి నృత్యం చేస్తూ..



ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని రవీంద్రనగర్ ఎస్టీ పిటర్స్ చర్చిలో..

# కార్మిక పక్షం టీబీజీకేఎస్

### సింగరేణి చరిత్రలో లేని విధంగా హక్కులు సాధించిన ఘనత సొంతం

- కేసీఆర్ సర్కారుతో అనేక ప్రయోజనాలు
- కారుణ్య నియామకాల ద్వారా 16 వేల మందికి ఉద్యోగాలు
- మరోసారి గెలిచేందుకు ఉవ్విళ్లూరుతున్న బీఆర్ఎస్ అనుబంధ సంఘం
- హ్యాట్రిక్కే లక్ష్యంగా ముందుకు..
- ఆఖరి రోజు జోరుగా ప్రచారం
- బాణం గుర్తుకు ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి

శ్రీరాంపూర్, డిసెంబర్ 25 : టీబీజీకేఎస్.. సింగరేణి చరిత్రలో లేని విధంగా అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడమేగాక లెక్కకు మించి హక్కులు సాధించి కార్మికుల మనసును చూరగొన్నది. కేసీఆర్ సర్కారు ప్రోత్సాహం, టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సారథ్యంలో ఆది నుంచీ కార్మికుల పక్షాన నిలుస్తూ వస్తున్నది. సింగరేణి యాజమాన్యంతో సంప్రదింపులు జరిపి కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన అనేక ప్రయోజనాలు సాధించింది. కార్మికులను కంటికి రెప్పలా కాపాడుకొని ఒక్క పోరాటం లేకుండా దేశ చరిత్రలో ఏ ప్రభుత్వ రంగ సంస్థ సాధించని అభివృద్ధి సాధించింది. నూతన హక్కులతోపాటు జాతీయ కార్మిక సంఘాలు పోగొట్టిన హక్కులను కూడా సాధించి కార్మికుల గుండెల్లో గూడు కట్టుకున్నది.

### ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ చేసిందేమీలేదు..

1998, 2001లో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన ఏఐటీయూసీ ఎలాంటి హక్కులు, ప్రయోజనాలు కల్పించిందో కార్మిక వర్గానికి తెలుసు. అందుకే 2003లో జరిగిన ఎన్నికల్లో ఆ సంఘాన్ని ఓడించి.. ఐఎన్‌టీయూసీకి పట్టం కట్టారు. ఐఎన్‌టీయూసీతో తమకు ఏదైనా లాభం జరుగుతుందేమోనని ఆశించిన కార్మిక లోకానికి చివరికి నిరాశే ఎదురైంది. ఇలా ఏఐటీయూసీ కాకపోతే.. ఐఎన్‌టీయూసీ.. ఐఎన్‌టీయూసీ కాకపోతే.. ఏఐటీయూసీ గెలుచుకుంటూ వచ్చాయి. 12 ఏళ్లు గుర్తింపు కార్మిక సంఘాలుగా ఉండి చేసిందేమీ లేకపోగా.. వారసత్వ ఉద్యోగాలు ఊడగొట్టింది. ఈ విషయాన్ని కార్మిక కుటుంబాలు ఇప్పటికీ జీర్ణించుకోలేక పోతున్నాయి. అలాంటి వారికి ఓట్లు అడిగే హక్కు లేదని, ఈ ఎన్నికల్లోనూ టీబీజీకేఎస్‌కే పట్టం కట్టి.. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీలకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరిస్తున్నారు.

### హ్యాట్రిక్‌పై టీబీజీకేఎస్ దృష్టి..

2012 అక్టోబర్ 5న.. 5వసారి జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మిక వర్గం టీబీజీకేఎస్‌ను ఆదరించింది. 23,311 ఓట్లు అందించి గుర్తింపు కార్మిక సంఘంగా టీబీజీకేఎస్‌ను నిలబెట్టింది. కేసీఆర్ సర్కారు సహకారంతో సింగరేణి చరిత్రలో లేని విధంగా అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు, నూతన హక్కులు సాధించింది కార్మికుల చేత ప్రశంసలు అందుకున్నది. 2017లో జరిగిన గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లోనూ విజయభేరి మోగించింది. 23,845 ఓట్లు సాధించింది. కార్మికులు గత ఎన్నికలకంటే 534 ఎక్కువ ఓట్లతో గెలిపించారు. ఇక ఈ నెల 27న నిర్వహించనున్న గుర్తింపు ఎన్నికల్లోనూ మరోసారి గెలిచేందుకు టీబీజీకేఎస్ ఉవ్విళ్లూరుతున్నది. టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు కవిత సూచనలతో నాయకులు హ్యాట్రిక్ సాధించాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నారు.

### ఆఖరి రోజు టీబీజీకేఎస్ జోరు

సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల ప్రచారం సోమవారంతో ముగిసింది. పక్షం రోజులుగా శ్రీరాంపూర్ ఏరియాలోని గనులు, ఓసీపీలపై బీఆర్ఎస్ అనుబంధ టీబీజీకేఎస్ నాయకులు విస్తృత ప్రచారం చేశారు. ఆఖరి రోజు శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 5, 6, 7, వర్క్‌షాప్‌లో సోమవారం టీబీజీకేఎస్ నాయకులు జోరుగా ప్రచారం నిర్వహించారు. టీబీజీకేఎస్ ఏరియా చర్చల ప్రతినిధి పెట్టం లక్ష్మణ్, మాజీ ఉపాధ్యక్షుడు బండి రమేశ్, బ్రాంచ్ కార్యదర్శి పానగంటి సత్తయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి తొంగల రమేశ్, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి సాదుల భాస్కర్, వెంకట్‌రెడ్డి, మల్లేశ్, రాజునాయక్, ప్రసాద్, పవణ్, లాల్‌లు గనులపై తిరిగి బాణం గుర్తుకు ఓటు వేసి గెలపించాలని కోరారు. సింగరేణి కార్మికులకు కేసీఆర్ సర్కారు 20 వేల ఉద్యోగాలు కల్పించిందని, యువ కార్మికులు టీబీజీకేఎస్‌ను గెలిపించి కేసీఆర్‌కు కృతజ్ఞత చాటు కోవాలని కోరారు. హక్కులు సాధించిన టీబీజీకేఎస్ కావాల్నో.. ఉన్న హక్కులు పోగొట్టిన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ కావాల్నో నిర్ణయించుకోవాలని సూచించారు. వికాస్, గోనె స్వామి, గరిగె చేరాలు, సతీష్, ప్రశాంత్, రాజయ్య పాల్గొన్నారు. ఉత్తేజ్‌రెడ్డి, హరీశ్ పాల్గొన్నారు. ఇక శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 7, 7ఏ, ఏరియా వర్క్‌షాప్‌పై మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, ఐఎన్‌టీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు జే శంకర్‌రావు, కలవేణ శ్యాంకుమార్ ప్రచారం నిర్వహించారు. అలాగే ఆర్కే–5గనిపై కేంద్ర నాయకులు కే సురేందర్‌రెడ్డి, ప్రచారం చేశారు. ఐఎన్‌టీయూసీ నాయకులు గరిగె స్వామి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు. సోమవారం ఆర్కే 7గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య మాట్లాడారు. నాయకులు రాజేంద్రప్రసాద్, అశోక్, నవీణ్, నర్సయ్య, బాలయ్య, రమేశ్, శ్రీనివాస్, తులా అనిల్, వెంకటస్వామి పాల్గొన్నారు. శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 5గనిపై బీఎంఎస్ జాతీయ బొగ్గు గనుల ఇన్‌చార్జి కొత్తకాపు లక్ష్మారెడ్డి ప్రచారం చేశారు. బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, బ్రాంచ్ కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డి, నాయకులు నాగేశ్వర్‌రావు, తిరుపతి, రమేశ్, గూడ శ్రీకాంత్‌రెడ్డి, వంశీకృష్ణ, రాజు, మహేశ్, రాజేంద్ర, పోతరాజు పాల్గొన్నారు. కాగా, ఎన్నికల్లో గెలుపొందేందుకు కొన్ని సంఘాలు డబ్బులు, మద్యం పంపిణీ చేస్తూ కార్మికులను ప్రలోభాలకు గురిచేయడం మొదలు పెట్టాయి. కార్మిక వర్గానికి కేసీఆర్ ప్రభుత్వం సాధించి పెట్టిన కారుణ్య ఉద్యోగాలు, కల్పించిన సంక్షేమ వసతులు, సౌకర్యాలే టీబీజీకేఎస్‌ను గెలిపిస్తాయని ఆ సంఘం నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



స్వాధీనం చేసుకున్న బులెరో వాహనం(చిత్రంలో నల్లని ముసుగులో కమల్ గోండ్, పువార్‌దేవి గోండ్, రాంవీర్ గోండ్, సలాం సింగ్ గోండ్)

## పిల్లలు కలిగేలా చేస్తామని.. తెల్ల కాగితాలను నోట్లుగా మారుస్తామని..

- మోసగించిన నలుగురి అరెస్టు
- రూ.3 లక్షలిస్తే రూ.6 లక్షలిస్తామని నమ్మబలికి మోసం
- బులేరో, రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్‌ఫోన్‌లు, రూ.2.10 లక్షలు స్వాధీనం
- వీరందరూ కూడా మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారు
- స్వెట్టర్లు అమ్ముకుంటూ ఊరి చివర డేరాలు వేసుకొని నివాసం

ఇచ్చోడ, డిసెంబర్ 25 : ఆదిలాబాద్ జిల్లాలోని సిరికొండ మండలానికి మధ్యప్రదేశ్ నుంచి 20 మంది బృందం గల సభ్యులు వారం రోజుల క్రితం వచ్చారు. వీరు బృందాలుగా ఏర్పడి ఊరు శివారులో డేరాలు వేసుకొని ఉంటున్నారు. రాజంపేట శివారులో కూడా కమల్ గోండ్, పువార్‌దేవి గోండ్, రాంవీర్ గోండ్, సలాం సింగ్ గోండ్‌లు నివాసం ఏర్పరచుకున్నారు. ఈనెల 19వ తేదీన రాజంపేటలో స్వెట్టర్లు అమ్ముతుండగా.. జంగుకు పిల్లలు లేని విషయాన్ని గ్రామస్తుల ద్వారా తెలుసుకున్నారు. జంగును కలిసి మాకు మహారాజ్ తెలుసని, నీకు పిల్లలు కలిగేలా చేస్తామని, రూ.3 లక్షలు ఖర్చవుతాయని తెలిపారు. ఈనెల 20వ తేదీన ఇచ్చోడకు తీసుకెళ్లి మహాగిరి మహారాజ్‌ను కలిశారు. జంగు నుంచి మహారాజ్ రూ.3 లక్షలు తీసుకున్నాడు. మీ ఇంట్లో ధనలక్ష్మి లేదని, ఈ రూ.3 లక్షలను రూ.6 లక్షలు చేస్తానని నమ్మబలికాడు. తన వద్ద ఉన్న ఒక డబ్బా, కెమికల్(సర్ఫ్), రెండు అద్దాల్లో పెట్టి రెండు, మూడు తెల్లని కాగితాలను రూ.200, రూ.500 నోట్లుగా వచ్చినట్టు నమ్మించాడు. సర్ఫ్ అయిపోయిందని, డబ్బులు తరువాత తయారు చేసి ఇస్తానని మహారాజ్ చెప్పడంతో జంగు ఇంటికి వెళ్లాడు. ఈనెల 21వ తేదీన బృందం సభ్యులకు ఫోన్ కలువకపోవడంతో సిరికొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో నలుగురు, సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నలుగురు కానిస్టేబుల్స్ మూడు రోజులుగా వెతుకుతున్నారు. సోమవారం ఉదయం కమల్ గోండ్, రాంవీర్ గోండ్‌లు సిరికొండ మండలంలోని కొండా ఎక్స్‌రోడ్డు వద్ద, పవార్‌దేవీ గోండ్, సలాంసింగ్ గోండ్‌లు ఇచ్చోడ బస్టాండ్ వద్ద దొరికారు. వీరి వద్ద నుంచి ఒక బులేరో, రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్‌ఫోన్‌లు, రూ.2.10 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రూ.90 వేలు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. మోసగాళ్లను చాకచక్యంగా పట్టుకున్న సిరికొండ ఎస్సై శ్రీకాంత్, సీఐ చంద్రశేఖర్‌ను డీఎస్పీ నాగేందర్ అభినందించారు. దొంగలపై చీటింగ్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.